# అధికారి

— కెఎస్వీ




గెస్ట్‌హౌస్‌లో మందుకొడుతూ కసికసిగా నవ్వుకున్నాడు అధికారి.
అధికారి పేరు అధికారి. పెద్దలు ఎంత ముందుచూపుతో పెట్టారో. మహా చతురుడు అధికారి. గడసరి. సారీ, ... అంత సొగసరి ఏమీ కాదు.
కానీ అన్ని సొగసులూ అధికారంలో ఉన్నాయి. డబ్బూ, దర్జా, పవర్.... అన్నీ ఉన్నాయి.
ఎర్రటి ద్రవంలోకి ఇంకా ఎర్రగా చూశాడు అధికారి. దాంట్లో సత్యం ముఖం మెదిలింది. దీనంగా ప్రార్థిస్తున్నాడు సత్యం.

"ప్లీజ్. సార్.... ఎలాగైనా ... ఎలాగైనా ...."

ఒక్క సంతకం ... పచ్చ సిరాతో ఒకే ఒక్క సంతకం ... ఒక్క కలంపోటు!

కానీ అంత సులభమా?

ముప్పై లక్షల కాంట్రాక్టుమీద ఉన్నతస్థాయి పరిశీలన.

పని బాగానే ఉంది. లోపాలేమీ లేవు. కానీ అలా అని రాయాలి కదా! రాసి, సంతకం చేయాలి కదా! ఊరికే ఎందుకు చేయాలి? ఎవ్వరికీ చేయక్కర్లేదు. అధికారి అలా ఎప్పుడు చేయలేదు.

చెయ్యడు. రావాల్సినవి రావాలి, అందాలి. ముట్టాలి. ఈ విద్యలో ఆరితేరిన మేధావి అధికారి.

నొక్కాల్సినచోట నొక్కుతాడు. ముక్కుపిండి, మూతి బిగపట్టి .... ఆ విద్య ఓ లలిత కళ!

సత్యం నీతిమంతుడు, నిజాయితీపరుడు. అయితేనేం? ఓ కాంట్రాక్టర్!

ఫ్లాష్‌బాక్‌లో ఓ యువజన నాయకుడు.

ఇలాంటివాళ్లని చాలామందిని చూశాడు అధికారి. సర్వీస్ చాలా పెద్దది. ఈ సత్యంగాళ్లంతా చివరికి ఏం చేస్తారు? బతకాలంటే 'అసత్యం'గాళ్లయిపోతారు.

ఎర్రటి ద్రవాన్ని ఖాళీచేసి మళ్లీ గ్లాసు నింపుకున్నాడు అధికారి.

సత్యం పంపిన సీసాలు!

ఎవరికోసమని పంపుతాడు?

సత్యం పంపిన నోట్ల కట్టలు సూట్‌కేసులో కాపురం చేస్తున్నాయి.

పంపకేం చేస్తాడు?

సత్యం పంపబోతున్న అమ్మాయి .... రావాలి .... ఈసరికి బయలుదేరి ఉంటుంది. కారులో దారిలో ఉంటుంది. ఎవరికోసం పంపుతాడు సత్యం?

మధ్యవర్తితో కండిషన్‌గా అంతా చెప్పేశాడు అధికారి. 'మర్యాదలన్నీ సరిగ్గా జరక్కుండా

సంతకం పెట్టాల్సిన ఖర్మ మనకేమిటయ్యా? ఓకే, పెడదాంలే! ఈసారి మళ్లీ వచ్చాక ... మరోసారి ఇన్‌స్పెక్షన్ చేశాక చూద్దాంలే! కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్ పడితే మనకేమిటట నష్టం?' చచ్చాడు సత్యం. కుక్కిన పేను .... తొక్కిన జీను.... కాలికింద చెప్పు!

ఎవడికోసం పంపుతాడు మనీ, మందు, మగువ ... అదీ ఖచ్చితంగా చెప్పేశాడు ఏ క్లాస్ కన్నెపిల్లే కావాలి. తేడా వచ్చిందో ... సంతకం హుళక్కి!

ఎవడికోసం?

పాపం, సత్యం అనిపించదు. తలుచుకుంటే తమాషా ... తమాషాగా అనిపిస్తుంది.

ఆ సత్యమేనా ఈ సత్యం?

సరిగ్గా ఏడు సంవత్సరాలక్రితం అధికారి వేరే డిపార్ట్‌మెంట్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ పల్లెప్రాంతాలకు ఎరువులు, క్రిమిసంహారక మందులు పంపిణీ తనిఖీ చేస్తూండగా ....

ఓ మారుమూల గ్రామంలో.... వెంకటాపురమా, రామాపురమా? దేశంలో ఎన్ని గ్రామాల్లో ఎన్ని జరగడంలేదు!

అప్పుడు ఈ సత్యంగాడు పెద్ద హీరో ... యువజన నాయకుడు!

000

డౌన్ డౌన్! అధికారి డౌన్ డౌన్! అవినీతి అధికారి డౌన్ డౌన్!

వ్యభిచారి అధికారి డౌన్ డౌన్! అవి నినాదాలా? శాపాలా? తిట్లా?

చుట్టుపక్కల పన్నెండు గ్రామాలనుంచి రైతులు, యువజనులు ఆందోళన ... ప్రదర్శన .... అధికారి ఆఫీసుముందు ధర్నా!

బైఠాయింపు.

నాయకుడు సత్యం. యువజన నాయకుడు సత్యం. నిజాలు వెలికితీసిన సత్యం ... ఎలుగెత్తి నినాదాలిచ్చిన సత్యం...

రైతుల ఆత్మహత్యలకు కారణమెవరు?

వేలాది ఎకరాల్లో పంటనష్టాలకు కారణమెవరు?

ప్రభుత్వం పంపిణీ చేయించిన ఎరువుల్లో, క్రిమిసంహారక మందుల్లో కల్తీని కనిపెట్టలేకపోయారా? తెలిసీ వదిలేశారా?

అవునవును, తెలిసి తెలిసీ వదిలేశారు.

ఇవిగో సాక్ష్యాలు ... అవిగో పత్రాలు ... చూడండి, ఇవన్నీ నకిలీ ఎరువుల మీద నిపుణుల రిపోర్ట్‌లు!

పత్రికలు దుమ్మెత్తిపోశాయి. అసెంబ్లీలో రగడ అయింది.

ప్రభుత్వానికి తల నొప్పి.

అయినా అధికారికి బోలెడంత పలుకుబడి ఉంది. మద్దతు ఉంది, వత్తాసు ఉంది.

సర్దుకున్నాడు. కానీ ప్రజలు సర్దుకోలేదు. రైతులు ఊరుకోలేదు. సత్యం ఊరుకోనివ్వలేదు.

ఫలితమే ఉద్యమం ... నినాదాలు ... ధర్నా ....!

అప్పుడే చూశాడు అధికారి సత్యాన్ని.

పోలీసు బందోబస్తులేపాటి? తుపాకులేపాటి?

గుండె పగిలేలా నినాదాలిచ్చాడు సత్యం.

నిలదీశారు రైతులు.

తోసుకొచ్చారు, దూసుకొచ్చారు.

అధికారిని చొక్కా పుచ్చుకున్నారు. 'చెప్పు, లంచం తీసుకున్నావా, లేదా? చెప్పు! ఫలానా గెస్ట్‌హౌస్‌లో బ్రాందీ తాగావా, లేదా? ఆరోజు ... ఫలానారోజు నీ గెస్ట్‌హౌస్‌కి అమ్మాయిలు వచ్చారా, లేదా!

ఎరువులు పనికిరావని తెలిసి తెలిసీ నువ్వు సర్టిఫికెట్ ఇచ్చావు. బాగున్నాయని తీర్పు చెప్పావు! కాపాడతాయనుకున్న ఎరువులే .... ఆ మందులే ఎకరాలకు ఎకరాల్లో పంటల్ని కబళించివేశాయి, తెలుసా? మూడేళ్ల కరువుతో ముక్కుతూ మూలుగుతూ ఉన్న రైతులు ఈసారి పంటలమీదే ప్రాణాలన్నీ పెట్టుకుని .... నిలువెత్తు పంటల్ని ఆశగా చూసుకుని .... కల్తీ మందుల వల్ల నష్టపోయారు. అప్పుల బాధ తట్టుకోలేక ఎనిమిదిమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు తెలుసా? తెలుసా....?'

చచ్చినవాళ్లు చచ్చారు. తనేం చావమన్నాడా? మరి మిగిలినవాళ్లు చావలేదేం? మనుషులన్నాక గుండె దిటవు ఉండాలి. తట్టుకోవాలి.

కానీ అధికారే ఇక తట్టుకోలేకపోయాడు. తప్పే తప్పే అని ఒప్పుకున్నాడు, లెంపలేసుకున్నాడు. సెలవు పెట్టేశాడు. అందరికీ క్షమాపణలు చెప్పి ... అక్కణ్ణుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ... పై లెవల్లో ఏవేవో ఆగచాట్లు పడి, రిమార్క్కుల నుంచి బయటపడి ... చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు ట్రాన్స్‌ఫర్ మీద ఎక్కడో తేలాడు.

సంవత్సరాలు గడిచినా, నిద్రల్లో, పీడకలల్లో ఒకే ఒక్క ముఖం భయపెడుతుంది ... నిలదీస్తుంది ... ఒక్క పేరే గుండెల్లో నిప్పులు రాజుకుంటుంది ..... సత్యం!

OOO

నిప్పులు రాలే కళ్లతో కొత్త సీసా అందుకున్నాడు అధికారి.


ఒళ్లంతా కసి బుస్సుమంటోంది.

కాలం మారుతోంది. యువజన నాయకులే పెద్ద కాంట్రాక్టర్లు అవుతారు. నీతి కబుర్లన్నీ నిప్పుల్లో కాలి కొత్త అవతారాలు తలెత్తుతాయి. ఇదో అవినీతి చక్రం! విషవలయం! ఇనుపచట్రం!


ఫలానా సత్యం అని తెలియగానే విదిలించి కొట్టి ఉండవచ్చు అధికారి. ధూం ధాం అని ఎగిరి ఉండవచ్చు. కాంట్రాక్ట్ పనుల్లో ప్రతి పాయింటుకీ కొర్రీ పెట్టి కొరివి నిప్పులే కురిపించి ఉండవచ్చు. కానీ దానివల్ల ఒరిగేదేమిటి? లాభం లేదు, పైగా బోలెడు నష్టం, అల్లరి, అపకీర్తి.

రంజు తెలిసిన విలన్‌లు చేసే పని కాదది. రాజకీయం కాదది. చావు దెబ్బ ఎలా ఉండాలి? సైలెంట్‌గా ఉండాలి. సైనైడ్‌లా ఉండాలి. దెబ్బతిన్నవారు కిక్కురుమనకూడదు.

అలాగే అయింది కదా! సత్యం ఇప్పుడు యువజననాయకుడు కాదు, కాంట్రాక్టర్. అన్నిటికీ తల ఊపాడు కదా సత్యం! ఎస్ సార్ .... అలాగే



## కొడుకు హీరో!



బాబూమోహన్ ఈమధ్య ఏమన్నాడో తెలుసా! తనకు ఆర్టిస్టుగా ఎవరూ పోటీయే కాదట. "నాకు నేనే పోటీ. ఆఖరి శ్వాస విడిచేవరకూ నటుడిగానే ఉంటాను అప్పటివరకూ నాకు పోటీయే లేదు. ఇది అహంకారంతో చెబుతున్నది మాత్రం కాదు. నా మీద నాకున్న నమ్మకం!" అంటున్నాడు. "మీ అబ్బాయిని హీరో చేస్తామన్నారు. ఆ విషయం ఎందాకా వచ్చింది" అంటే, "మా ఉదయ్‌బాబు హీరోగా ఈ ఏడాదే ఓ భారీ చిత్రం మొదలవబోతోంది. దానికి నిర్మాతనీ, దర్శకుణ్ణీ నేను కాదు. ఓ ప్రముఖ దర్శకుడి ద్వారానే మా వాణ్ణి హీరోగా పరిచయం చేస్తాను!" అన్నాడు. ఇది మాత్రం లవ్‌స్టోరీ కాదట. యాక్షన్ సెంటిమెంట్ చిత్రమట.

ఎల్

సార్ ..... ఎవడికోసమని? .... ఎవడికోసమని ....?
సర్రున వచ్చి ఆగింది కారు.
డ్రైవరు, మరో మనిషి గుసగుసలు ...
గుడ్డి వెన్నెల్లో మెరుపులా దిగింది పదహారేళ్ల పరువం. చూడగానే తెలుస్తోంది ... ఆ సిగ్గూ, భయమే చెప్తున్నాయి. కసిగా ఉన్నా, క్రైపుతో ఉన్నా కళ్లినిమాత్రం ఇట్టే పసిగట్టేస్తాయి అధికారి కళ్లు. వచ్చిందీ, వస్తున్నదీ మచ్చలేని అచ్చమైన కన్నె!

ooo

ముద్దంటే వద్దంటుంది. తాకితే తప్పుకుంటుంది. పట్టుకుంటే భయపడుతుంది. వాటేసుకుంటే వణుకుతుంది. నిమిరితే నిప్పులా కాలుతుంది. దువ్వితే దూరమవుతుంది. మాటమాటకీ మాటిమాటికీ మాటున దాగుతుంది ... ఆడతనం ... కన్నెతనం!
అధికారి చాలా అనుభవజ్ఞుడు. ఆరితేరిన యోధుడు. సరసుడు, చతురుడు. కసీ క్రైపూ ఎన్ని ఉన్నా కన్నెపిల్లని మాత్రం కొత్త బ్లేడును తాకినట్టే తాకుతాడు.
ఎన్నెన్ని చూడాలి ... కళ్లారా చూడాలి ... చేతులకు పని, వేళ్లకు పని, గోళ్లకు పని, పెదవులకు పని ... పలువరుసకు పని ... నాలుకకు పని ... గుసగుసలు ... భరోసాలు ... అనునయం, గారాలు.
ముడుచుకుపోయే మొగ్గల్లాంటి సిగ్గుల్నీ ఒక్కటొక్కటీ విడదీసి దారికి తెచ్చుకుంటే .... అదీ శృంగారం.
తెల్లారిపోతున్న వేళ ఆ అమ్మాయి ఏడ్చింది.
ఓదార్చాడు అధికారి. చిన్నపిల్ల. పోగొట్టుకుంది, ఏడుస్తుంది. సహజం.
కానీ "మన చెయ్యి మంచిదేలే ...." అని ఊరడించాడు అధికారి. "యు ఆర్ వెరీ స్వీట్ గర్ల్! ఎప్పటికీ గుర్తుంటావులే!" అన్నాడు.
గుర్తుగా తన ఖాతాలో జ్ఞాపకం పెట్టుకున్నాడు. అదో రికార్డు!!

ooo

తెల్లారే వెళ్లిపోదామనుకున్నవాడు మధ్యాహ్నందాకా రెస్ట్ తీసుకుని చల్లగా సాయంత్రానికి ఫైలు తెప్పించుకుని అన్న మాటప్రకారం సంతకం పెట్టేసి రైలెక్కేశాడు అధికారి. స్టేషన్‌కి సత్యాన్ని రావద్దని అదివరకే చెప్పాడు. ఏదీ గుట్టుచప్పుడవకూడదు! అదీ లలిత కళ!!
కానీ పదిరోజులకే తీవ్రంగా జబ్బుపడిన అధికారి డాక్టర్ల దగ్గరకెళ్లి అన్ని పరీక్షలూ చేయించుకున్నాక అదిరిపడ్డాడు. వణికిపోయాడు. అంతకన్నా ఘోరంగా క్రూరంగా షేక్ చేసేసింది సత్యం నుంచి వచ్చిన ఉత్తరం...
"ఆ అమ్మాయికి చాలా డబ్బు అవసరమైంది. అదీ వైద్యంకోసం. నేను ఊరికే ఎందుకివ్వాలి? నా పని చేసిపెడుతుందని ఇచ్చాను. పోనీ ఆ అమ్మాయికి కొంతకాలంపాటు వైద్యానికైనా పనికొస్తుంది. బతికే ఆశ లేకున్నా, వైద్యులమీద నమ్మకమే లేకున్నా చేతనైన ప్రయత్నం చేయాలి కదా! మిస్టర్ అధికారీ! మీకేం, బోలెడు డబ్బుంది, పలుకుబడి ఉంది. మీ వైద్యం మీరు చేసుకోవచ్చు. నాకు ఒకటే సంతోషం ... మా రైతుల ఆత్మహత్యలకు .... వద్దులెండి ... ప్రతీకారం చేయడానికి నేనెంతవాణ్ణి? త్వరలో వారి ఆత్మలకు తప్పక శాంతి కలుగుతుంది .... కదూ? బలమైన శత్రువుల్ని నాశనం చేయడానికి పూర్వం విషకన్యల్ని తయారుచేసి పంపినట్టు పుస్తకాల్లో చదివాం. నమ్మబుద్ధి అవదు. ఈ అమ్మాయి కన్నెపిల్లే! కానీ చాలాకాలం క్రితం రక్తం మార్పిడివల్ల ఎయిడ్స్ సోకింది. నమ్మబుద్ధి అవదుగానీ ఈ అమ్మాయి ఎయిడ్స్ కన్య .... సో సారీ .... ఆల్ ది బెస్ట్!" ■

